# ఉపశమనం

"అదోరకం ఆకర్షణ".. అన్నాడు విశ్వం. నేనుకాక ఆ గదిలో యింకో నలుగురున్నారు. అందరిపని మంచి హుషారుగా వుంది. మా యిద్దరి స్నేహం ముప్పై ఏళ్ళలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంది. వయసు ఎంత ఎదుగుతున్నా మేం యిద్దరం కలిసున్నప్పుడు మాత్రం చిన్నతనంలాగే వుంటుంది.

అలా అన్న విశ్వం ముఖంలో వింతకాంతి కనిపించింది నాకు. విశ్వం గతంలో చాలాసార్లు చాలామంది స్త్రీల గురించి చెప్పాడు. కానీ యీసారి... యిప్పుడు చెపుతున్న కరుణ అన్న యీ అమ్మాయి విషయం చెప్పినపుడు వాడి గొంతులో పలికిన ధ్వని గతంలో నేనెప్పుడూ వినలేదు.

ముందునుంచీ డబ్బున్న విశ్వానికి యీ మధ్య తలపెట్టినవన్నీ కలిసొచ్చి చాలా డబ్బు చేరింది. సహజంగా తన చుట్టూ జనం వుండటమంటే యిష్టపడే వాడికి, వీలున్నంతగా స్త్రీల సహచర్యం అంటే యిష్టం.

ఎవరికీ చెరుపు కలిగించని వాడి స్త్రీ లోలత్వం నా కెప్పటినుంచో పరిచయం వున్నదే.

'స్త్రీతో యిష్టంగా గడపటం ఎంత తృప్తో... ఈ తర్వాత వెలకట్టినట్టు ఎంతోకొంత డబ్బు యివ్వడం అంత యిబ్బందిరా...' అని చాలాసార్లు చాలా సందర్భాలలో అన్నాడు. మాటవరసకి వాడు అలా అనటం కాదు. స్త్రీల విషయలో వాడి మృదు ప్రవర్తన నాకు తెలిసున్నదే!

తను వెళ్ళే స్త్రీల దగ్గరి అనుభవాన్ని ఎంత ఉన్నతంగా భావిస్తాడో వారి ఆ పరిస్థితికి అంతగానూ బాధపడతాడు.చాలామందికి అది పనికిరాని సెన్సిటివిటీ అనిపించొచ్చు కాని కొన్ని మనస్తత్వాలు మారవు.

'జీవితంలో యిన్ని అనుభవాలతో యింత దూరం వచ్చావు. ఇప్పటికేనా పెళ్ళిచేసుకోకూడదూ...' అని చాలాసార్లు... వీలున్నన్నిసార్లు చెప్పాను.

విశ్వం వినదని తెలుసు... తెలిసి చెప్పడం.

విశ్వాన్ని వదిలేసి విడాకులు తీసుకుని వాడిభార్య వెళ్ళిపోయి అప్పుడే పదేళ్ళు దాటింది. ఆ అమ్మాయి నాకు తెలిసున్న అమ్మాయే. ఇద్దరూ మంచివాళ్ళే. యిద్దరికీ పరస్పరం యిష్టమే. అయినా విడిపోయారు. ఇదీ కారణం అని ఖచ్చితంగా చెప్పలేని అనేకానేక కారణాలవల్ల విడిపోయారు. అదీ పెళ్ళయిన ఏడాది తిరక్కుండానే విడిపోయారు.

వాళ్ళిద్దరూ విడిపోవటానికి కారణాలుగా ఎన్నోసార్లు వాడు ఎన్నో విషయాలు చెప్పాడు. నావరకూ నాకు అవేవీ పెద్ద కారణాలు అనిపించకపోయినా వాళ్ళకి అవి చాలా పెద్ద విషయాలు.

ఏది ఏమైనా పరస్పర నిందలతో కాకుండా యిద్దరికీ సరిపడలేదన్న నిర్ణయంతోటే వాళ్ళిద్దరూ విడిపోవటం చాలావరకు నయం.

విఫలమైన వివాహజీవితమో... విలక్షణమైన మనస్తత్వమో కానీ ఆ తర్వాత జీవితంలో విశ్వం చాలామంది ఆడవాళ్ళకి దగ్గరయ్యాడు. కానీ ఏ స్త్రీని తనకీ మరీ దగ్గరగా రానివ్వటంలేదు.

ఏ అమ్మాయి గురించేనా వాడు ఒకటిరెండు సార్లు మాట్లాడితే, నాకు చిన్న ఆశ. వివాహజీవితం అయితేనే సజావుగా సాగుతుందన్న సంప్రదాయ ఆలోచన నాది.

నేను గతంలోంచి బైట పడేటప్పటికి.. "ఒరే యింత గొప్పగా చెపుతున్నావు. కరుణని ఒక్కసారిగా మాక్కూడా చూపించరా.. ఊరికే, చూసి వచ్చేస్తాం..." అంటున్నారు నలుగురూ ఏకకంఠంతో... ఆ నలుగురూ కూడా మాకు దగ్గర స్నేహితులే.

విశ్వం సరేనంటాడని నాకు తెలుసు. అక్కడ ఏ అల్లరి చెయ్యకూడదని పదేపదే జాగ్రత్త చెప్పి ఆ రాత్రికే వాళ్ళని తన కూడా తీసుకెళ్ళటానికి ఒప్పుకున్నాడు విశ్వం. నన్నూ రమ్మన్నాడు, వెళ్ళాలని వున్నా వెళ్ళలేకపోయాను.

కానీ ఆ మర్నాడు అలా జరుగుతుందని... నేను అలా చేస్తానని ఊహా మాత్రంగానేనా అనుకోలేదు.

కరుణ అందాన్ని ఆ నలుగురు నాలుగు రకాలుగా చెప్పారు. కేవలం ఆ అమ్మాయిని చూసివచ్చినందుకే వాళ్ళలో ఉద్విగ్నత వెలుగుతోంది.

ఒకటిరెండు రోజులకన్నా ఎక్కువ పరిచయం ఏ స్త్రీతోటి కొనసాగించని విశ్వం గత పదిహేనురోజులుగా కరుణతోటే గడుపుతున్నాడు. ఏమిటిరా ప్రత్యేకత అంటే... 'అదోరకం ఆకర్షణ'... అంటాడు తప్ప, యీ నలుగురూ చెప్పినన్ని వివరాలు కూడా చెప్పటంలేదు. నలుగుర్ని తరచి తరచి అడిగితే బైటపడిన విషయం కొంచం మొరటుగా వుంది. బాధాకరమైంది కూడా!

'ఆ యింట్లో ఆ అమ్మాయి ఒక్కత్తే.... ఒక గది, చిన్న వంటిల్లు.. అంతే యిల్లు... అమ్మాయి అందమైందే! సందేహంలేదు కానీ వ్యాపారం చేసుకుంటున్న ఆడాళ్ళలో యింతకన్నా అందమైన వాళ్ళు చాలామంది వున్నారు. ఎటొచ్చీ ఎవరేనా వచ్చి వ్యవహారం స్థిరపడగానే ఆ అమ్మాయి తండ్రి నిశ్శబ్దంగా తలుపు దగ్గరకేసి వెళ్ళిపోతాడు. ఆయన ఆ అమ్మాయి తండ్రి అనటానికి సందేహంలేదు. తండ్రీ కూతుళ్ళనీ చూడగానే పోలికనిబట్టి స్పష్టంగా తెలుస్తుంది. ఆ తండ్రీ కూతురు పరస్పరం ప్రాణంగా వుంటారన్నది వాళ్ళ చూపుల్ని బట్టి ఎవరికేనా తెలుస్తుంది.

'తండ్రి కూతుర్ని అలా వదిలేసి తలుపు వెయ్యటంలో వింత ఆకర్షణ... అంతే తప్ప స్పెషాలిటీలేదు' అన్నది నలుగురూ వెలిబుచ్చిన అభిప్రాయం.

విశ్వంతో కలిసి ఆ రాత్రి నేను కరుణ యిల్లు చేరేవరకు నాకు అది మెలకువున్న కలలాంటి అనుభవం.

నేను కరుణని చూట్టం, మాట్లాట్టం, అన్నీ అలాగే కలలాగే వున్నాయి.

సిటీలో వుండాల్సిన యిల్లు కాదది. చిన్న పెంకుటిల్లు. ఇంటిముందు అరుగుకూడా వుంది. ఆ అమ్మాయి కరుణ కూడా అలాగే ఆ వృత్తి నప్పిన మనిషిలా లేదు.

మేం వెళ్ళి అయిదు నిముషాలు గడవలేదు. కరుణ తండ్రి లేచాడు వెళ్ళటానికన్నట్లు. గబుక్కుని నేనూ లేచాను. ఆయన దగ్గరికి చేరి... "మీకు అభ్యంతరం లేకపోతే మీ కూడా నేను వస్తాను" అన్నాను.

చాలా పొడిగా..."రండి" అన్నాడు. నిర్ధారిత గమనంలా నడుస్తున్నాడాయన.

పట్టుమని వంగగజాలు కూడా వెళ్లలేదు. ఆ బార్ ముందు నిలబడ్డాడాయన.

లోపలికి వెళ్లి కొంచం స్థిమితపడ్డాం. నా యిబ్బంది గమనించినట్టు ఆయనే మాట్లాడుతూ వచ్చాడు. రకరకాల విషయాల గురించి ఆయన సూటిగా, స్పష్టంగా మాట్లాడుతున్నా, దేన్నో తన దృష్టిలోంచి దూరంగా వుంచటానికి మాట్లాడుతున్నట్టున్నాయి ఆ మాటలు.

ఏదేదో తెలుసుకోవాలన్న తపన, ఏం మాట్లాడలేని అస్థిమితం నన్ను యిబ్బంది పెడుతూనే వున్నాయి.

కరుణతండ్రి... ఆయన్ని ఆయన నిభాయించుకుంటున్న తీరు చాలా నిండుగా... చిత్రంగా వుంది. జరుగుతున్నదానికి, కరుణ విషయంలో ఆయన చేస్తున్నదానికి ఎంతమాత్రం సమర్ధన కానీ, చిన్నతనం కానీ ఆయన మాటల్లో, చేతల్లో ఎక్కడా కనిపించటంలేదు.

ఎంతో వోర్పుగా ఆయన్ని ఏమాత్రం యిబ్బంది పెట్టకుండా ప్రవర్తించాలన్న నా నియంత్రణ నాకే ఇబ్బందిగా వుంది. తట్టుకోలేక మరో అరగంట తర్వాత బైటపడిపోయాను.

"ఆర్థికంగా యిబ్బంది వుంటుందని నాకు తెలుసు...అయినా మరో గదివున్న కొంచెం పెద్ద యిల్లు తీసుకుంటే మీరు యిలా బైటికి వచ్చేసే యాతన తప్పుతుంది కదా..." అన్నాను. నేను అడుగుదామనుకున్నది వేరని నాకే తెలుస్తోంది.

కరుణని చూసి వచ్చాక మా స్నేహబృందం నలుగురు వెలిబుచ్చిన అభిప్రాయం విషయంలో నాకు సందేహనివృత్తి కావాలి. కరుణ పట్ల విశ్వం అకర్షణకి ఆ తండ్రి అలా వచ్చేయటం అన్నది విషయమే కాదని నాకు తెలుసు. అయినా ఎందుకో ఆ విషయం తాలూకు వివరాలు కావాలి.

"మేం వుంటున్న యిల్లు అద్దె యిల్లు కాదు. నా సొంతయిల్లు...పేరుకే లెండి... ఆ యింటికి మించిన అప్పులున్నాయి. నా గత జీవితంలాగే ఆ యిల్లూ నన్నొదలటం లేదు. నేనూ వదులుకోలేకపోతున్నాను. మీ ఉద్దేశం నాకు అర్థమైంది. మరో గదివుంటే తీరిపోయే యిబ్బంది కాదండి యిది.

మనిషి కొన్ని ఆశలకి, అందాలకి బందీ...నాకు సంగీతం ఆశ, సినిమాలు ఆశ... అందుకే యీ సినీనగరం వదలలేక యిలా అయిపోయాను. నా ఆశలు, నిరాశలు నా వరకే ఆగలేదు. నా ఒక్కగానొక్క కూతురి వరకూ వచ్చాయి. జీవితంలో నాకు చాలా సందేహాలున్నాయి. నా కరుణని నేనే యీ దిశగా ప్రోత్సాహించానా లేదా అన్నది నాకే స్పష్టంగా తెలియదు. కరుణలో యీ రకం ఆశలు తలెత్తినప్పుడు ఖండించలేదు...

ప్రస్తుతం ఫలితం యిది...

యిదో తప్పని విషం...రోజూ నాకు తాగక తప్పదు. అక్కడున్నా, ఆ యింటి నుంచి దూరంగా వున్నా నేను తండ్రినే, నా కరుణ కాలికి దెబ్బ తగిలినా, వేలునెప్పెట్టినా అప్పుడూ, యిప్పుడూ నా బాధ నాదే... తప్పని అసమర్థత... మనసు మెత్తదనాన్ని చాలా ఏళ్ళు చంపుకోలేకపోయాను... యిప్పుడు యీ పరిస్థితులకి అదే నెమ్మది నెమ్మదిగా చచ్చిపోతోంది. అయినా యింకా ఏదో వెర్రి తాపత్రయం..."

ఆయన కళ్ళు నాకు స్పష్టంగా కనపడటంలేదు. అయినా ఆ తండ్రి మనసు తడి తెలుస్తోంది. అగ్ని కీలలా ఆ తడి నన్ను తాకుతోంది. తప్పనిసరో... ఎందుకో తెలియకుండానే మరోగంట కూచున్నాం.

తండ్రి కూతురుతో వ్యాపారం చేయటం... అందులో రకరకాల మెళకువలు అన్న విషయాలు నేను చాలాసార్లు విన్నాను. అవన్నీ నిజాలైనా అబద్ధాలైనా ఫలితం ఒక్కటే...అంతా బాధే.

నేను విశ్వం కలిసి తిరిగి వస్తున్నాం. తన మనసు కొంతవరకు నా ముందుంచాడు. ఎవర్నీ, దేన్నీ నిందించకుండా, అటువంటి పరిస్థితుల్లో కూడా ఆ తండ్రీ కూతురు తమని తాము నిభాయించుకుంటున్న తీరు విశ్వాన్ని పట్టుకుంది అంతే తప్ప మావాళ్ళు అన్న ఆకర్షణ కాదు.

"ఎందుకోరా కరుణని వదులుకోలేకపోతున్నాను..." అన్నాడు విశ్వం.

"పోనీలేరా... యిప్పుడు నష్టమేముంది" అన్నాను. ఎన్ని ఎక్కువరోజులు విశ్వం కరుణతోవుంటే, ఆ తండ్రీకూతురికి ఆర్థికంగా అంత మేలని నా ఉద్దేశం. విశ్వం కరుణని పెళ్ళాడతాడనుకోటం అత్యాశ. ఎంత వరకు మేలు జరిగితే అంతేచాలు. మనసులో చల్లటి మంచు తెరలాంటి అస్పష్ట స్థితి... కొంత వరకేనా తృప్తి.

- జ్యోతి మాసపత్రిక - ప్రమోదసంచిక-ఉగాది 1990.